# గత్తర

''ఊరును తమరేకాపాడాలి పంతులుగారు'' అంటూ రెండుచేతులు జోడిస్తూ అన్న ముసలి పాపన్నను అనుసరించారు ఘడిముందు గుమి గూడిన జనం. అప్పుడే లోపలినుండి వస్తున్న కరణంగారితో -

"అవును దొరా! నిన్న ముగ్గురు, రాత్రి ఐదుగురు. పది మంది దాకా సుడి బడిన్నారింకా'' -యింకొకరు.

''అసలు సంగతేమిట్రా''— తనకేమి తెలియనట్లు అడిగాడు గ్రామ కరణం రంగారావు.

ఎత్తైన విగ్రహం. మత్తెక్కిన కళ్ళు నల్పును కోల్పోతున్న తల వెంట్రుకలు నలుబై దాటినవని సాక్ష్యం.

"తమరికి తెలియందేముంది, పంతులుగారూ. ఊర్కి గత్త రొచ్చింది. ఈ గండాన్ని తమరే తప్పియ్యాలి."

"గత్తర! ఆదెట్లొచ్చె మనూర్కి"— చూపుల్లో తెచ్చిపెట్టుకున్న ఆత్రుత. మాటల్లో అదోరకమైన అమాయకపు శబ్దం,

"ఎట్లొచ్చిందేముంది దొర. మొన్న లచ్చిగాడు పట్నం నుంచొచ్చాడు. వచ్చిరాడంతోనే కక్కుడు మొదలైంది. తెల్లారేవరకు వాడు, మల్ల పొద్దుగూకే వరకు అని పెండ్లాం - యిద్దర్నీ గద్ద తన్నుక పోయినట్టే..."

"మరి నా దగ్గరికొచ్చారేమిరా? సర్పంచ్ దగ్గరి కెళ్ళండి."— కరణంగారి ముఖంలో ఏవో ఎత్తిపొడుపు ముద్రలు కనిపించాయి.

"సర్పంచు డాక్టరిని తీసుకొస్తందుకు సమితికి పోయిండట. ఊర్లో లేడు."

కరణంగారి పెదవుల మధ్య చిరునవ్వు నర్తించింది. అతని గుండెలో గూడు కట్టుకున్న విషం కళ్ళల్లోకి ప్రాకింది. దాన్ని దాయడానికి కాబోలు కళ్ళనొక్కసారి మూసి తెరిచాడు. వీళ్ళందరు గ్రామ పంచాయతీ ఎన్నికలలో తన మాట వినందికూడా గుర్తొచ్చింది.

"మనుష్యులు చచ్చాక డాక్టర్లెందుకురా? అయినా, డాక్టర్లు గత్తరను కట్టినట్లు ఏ పూర్లనైనా విన్నారా?"

"లేద్దొరా–లేదు" సగానికి పైగా.

"ఎక్కడయిన లేదు" కొన్ని ముసలిగొంతులు కలసికట్టుగా సాక్ష్యమిచ్చాయి.

"అయినా మన తాత తండ్రులు ఏ డాక్టరిచేత చేయించారు. యివన్నీ నడమంత్రపు చేతలు-" అన్నాడు కరణం గారి నమ్మిన బంటు.

"గత్తరకు డాక్టరేమి చేస్తాడు. కడితే, మంత్రగాళ్లు కట్టాలిగాని"- పెద్దవాళ్ళ సలహా.

అంతవరకు ధోతి అంచును పరిశీలిస్తూ వింటున్న కరణం గారు- "అద్గది. మంత్రగాళ్లు కట్టవలసిందే."

గ్రామ తగాదాలలో తనను ఎదరించి, తన పశువులు చస్తున్నా పట్టించుకోని మంత్రాల మారయ్య మనసులో మెదిలాడు.

"మరి, మన మారయ్య నడగలేక పోయారా!"

"ఆడా। అనికేమి తెలియదన్నాడు పంతులుగారు."

"తెలియదు! ఎందుకు తెలియదట? ఆ సంగతేదో నేను చూస్త గద."

మస్కూరి వైపు చూస్తూ-"అరే! నీవె పోయి వాన్ని పట్రా - పంతులు తొందరగా రమ్మంటున్నారని చెప్పు."

గుంపులో గుసగుసలు.

''అపుప. వానిపనే-''

''పుల్ల బెట్టిండు. మెల్లగ గూసుండు.''

''లేకుంటే యిట్లెన్నడన్నా జర్గిందా ?''

నుదుట విభూతి, చేతిలో వెండి అంచులు వేసిన గండ్రగొడ్డలి, భుజాన నల్లగొంగళి. ముంజేతులకు వెండి కడియాలు, చెవులకు బంగారు పోగులు, బుజ్జ మీసాలు, తట్టంత తలపాగాతో గుంపును దాటి కరణం గారి ఎదుటికొచ్చి-

''దండాలు పంతులుగారు'' గొడ్డలితోనే చేతులు జోడించి దండం పెట్టాడు.

''దండం దండం.'' అంటూ నిలవెల్లచూశాడు మారయ్యను.

''మారయ్యగారు....''

''అయ్యా! అయ్యా! దొరలు దొరలు ఎందుకు అంతా నిష్ఠూరం.

''నిష్ఠూరం ఏముందిందులో, నిజం అడగడానికే పిలిపించాం.''

''అడగండయ్యా......''

''నీ అంతటి మంత్రగాళ్లుండగా వూరంతా పీనుగుల పెంట్లైపోతుం దేందని...''

''దానికి నేనేం చేయను దొరా...''

''నీవు చెయ్యకపోతే మరెవ్వరు చేస్తారేమి! కావలసిన కార్యాలుచేసి ముందు గత్తరను కట్టు.''

''నాకేమి తెలియదు దొరా. ఏదో పసుల కంటే...''

''పసులకంటే-మనుషులకంటవు : మనుషులకంటే పసులకంటవు. అసలు నీ సంగతేమిటాంట.''

"యింటున్నావా? నీ యిష్టం. వాళ్ళను శాంతపరచాలంటే నీవీ గత్తరను కట్టాలి. కావలసినంత ఖర్చు తీసుకొని అమ్మవారి పండుగ చేయించు, బలులు యిప్పించు. లేదా నీవే బలైపోతావు. నీ యిష్టం. చూస్తు నిల్చుంటే పనికాదు. చేస్తువుంటే అవుద్ది."

"అరే మస్కూరి! పూళ్ళోని కుల పెద్దలందర్కీ చెప్పు, రాత్రికి అమ్మోరి పండుగని,"

మారయ్య మాట్లాడలేదు.

"పండగైతే కానీ..."అంటూ కరణంగారు ఘడిలోకి పోయాడు.

అమ్మవారి పండగ జోరుగా జరుగుతోంది. నడిపూళ్ళో వున్న అమ్మవారి గుడిముందు పందిళ్ళువేసి తోరణాలు కట్టారు. దప్పుల చప్పుళ్ళు మారుమ్రోగుతున్నాయి. కులాల వారిగా కూర్చున్నారందరు త్రాగడం తెలిసిన ప్రతివాడు బాగా త్రాగున్నాడు.

పందిరి క్రింద పసుపు, పిండి, బొగ్గు పొడితో వేసిన పటాలమీద (ముగ్గుల్లాంటివి) అన్నంవండి కుంభం పోశారు. ప్రక్కనే కల్లుకుండలు పొంగుతున్నాయి.

మంత్రాల మారయ్య మూగల నిక్కరు తొడక్కొని, చేతిలో నిమ్మకాయలను గ్రుచ్చివుంచిన నిలువు కత్తి పట్టుకొని అమ్మోరి దండకం చదువుతోన్నాడు. ఉన్నట్టుండి దప్పుల చప్పుడు ఎక్కువైంది. మైశాచ్చి పొగ గప్పున లేచింది. పోతును నరికారు. మేకలను, గొర్రెలను, కోడి పుంజులను ఒక్కొక్క వ్రేటున నరుకుతోన్నారు. మరికొందరు తల లను ఇరపోసుకొని, వేపకొమ్మలను పట్టుకొని "హుస్...హుస్..." అంటూ సిగం వూగుతున్నారు.

రాత్రంతా పండగ పేరుమీద జరగవలసినవన్నీ జరిగాయి తాగడం, తినడం, తందనాలాడడం.

తెల్లవారింది.

పొరచుట్టను పీలుస్తూ గడి ఎదుటకొస్తున్న కరణంగారి కెదురుగా కొందరు పెద్దలెల్లగా-

"సర్పంచ్ గారింకా రాలేదా ?"
"లేదండీ..."
"ఎందుకొస్తాడు. వూరు ఏమైపోతే ఆయనకేం ?"

"ప్రజల బాగోగుల చూడదానికి గదండీ ఆయన్ని ఎన్ను కుందీ..." అన్నాడొక యువకుడు.

"సమితాఫీసు సల్లగుంటే చాలు. వాళ్ళకి ఊరు, ఊర్లోని వాళ్ళ సంగతెందుకు..."

"అయ్య డాక్టరిని తీసుకురావటానికని వెళ్ళి యింకా రాలేదేమి ?"
"ఆయన వస్తడు - డాక్టరును తీసుకొస్తడు, మారయ్యను పిలు..."

"ఆడు మంత్రాలు చదువుతునే వున్నడు. ఒక్కొక్కరు చస్తూనే వున్నారు."

"యిక వాడిచేత కాదు. వేరే మంత్రగాన్ని పొరుగూరి నుండైన పిలిపించాలి."

''తొందర పడకండి.'' అక్కడికే వస్తున్న మారయ్య నుద్దేశిస్తూ-

''ఏం మారయ్య ఎక్కువైందట-''

''నేనేమి చెయ్యను దొర, చెయ్యవలసిన పనులన్నీ చేశాను.''

వేరేవాడెవ్వడో ఎగనూకినట్లుంది.

''ఆ యింకెవ్వడున్నాడు ఎగనూకడానికి.''

''ఏ-యిదంత యీడి పనే''-మందిలో నుండి ఒకడు.

''నా కొడుకు చచ్చాడు''-ఓ తండ్రి.

''నా అయ్య చచ్చాడు''-ఓ కొడుకు.

''నా భర్త-'' ఓ భార్య.

''వింటున్నావా మారయ్యా-యిందరు చస్తుంటే చూస్తు కూర్చు న్నావేం.

ఐదొందలు పెట్టి పండగ చేయించావు. అయినా గత్తర నాపలేక పోయావు. నీ యిష్టం, వీళ్ళంత కోపంలో వున్నారు. ఏం జవాబు చెప్పు తావో చెప్పుకో.

మారయ్య నోటినుండి మాట రావడంలేదు.

''వాడేమి చెప్పుతాడండీ, బొక్కలిరగ తంతేగాని చెప్పడు.''

''వూర్కె, పండ్లూడగొడితే పోద్దసలు.''

''చెప్పరసె చెప్పు. గత్తర కడతానంటవా, లేదా?''

—అంటూ ఓ వ్యక్తి అతన్ని రెక్కపట్టుకొని ఊపాడు.

''తన్ను తన్నుర. సంగీతానికి సింతాకాయలు రాల్తాయా ?

దెబ్బ పెడితేగాని-''అంటు మరొకడు లేశాడు.

సమయాన్ని గమనించిన కర్ణంగారి కనుబొమ్మలు సైగ చేశాయి.

చెంప ఛెల్లుమంది.

వీపున గుద్దాడొకడు.
డొక్కలో తన్నాడింకొకడు.
"అమ్మో" అంటూ నేల కొరిగాడు మారయ్య.
తల రక్తం చిమ్మింది.
గుండె ప్రాణం వదిలింది.

యింతకు ముందే నరికి పడివున్న బలి జీవులలో మారయ్య ఒకడైనాడు.

కరణం పగ తీరింది. కాలి చల్లారిన పొగచుట్టను నేల కొట్టి అందర్ని పిలిచి-

"ఎంతపని చేశార్రా, పోలీసుల కెరుకైతే యిప్పుడేం కావాలి ?"

అందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. కళ్ళలో భయం కడుపులో బుగులు. త్రాగిన కైపు దిగింది. చమటపట్టి కాళ్లు చేతులు వణక సాగాయి.

కరణం మరొక చుట్టను వెలిగించి -

"భయపడకండి, నేను చెప్పినట్లు చేయండి. వెంటనే వీన్ని పూడ్చేసి, వీడుకూడా గత్తరలోనే చచ్చాడని చెప్పండి. విషయం బయటకు పొక్కిందో మీరందరూ బోనెక్కాల్సిందే. అంతేకాదు జైలు పాలవుతారు."

అందరూ సరేనన్నారు. కట్టు కట్టేశారు. కట్టు తప్పితే కాలం కూడుద్దన్నారు.

మారయ్యాసు పూడ్చడం ముగిసింది. గంట గడిచింది.

గుడి దగ్గర నుండి ఘడి వైపు నడుస్తున్న కరణం హఠాత్తుగా ఆగిపోయాడు. కడుపులో తిప్పుతోందని కళ్ళు మూసాడు.

ఆర్. యం. పి. ని పిలవమన్నాడు. వళ్ళు తిరుగుతోంది. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. పట్టణంలో చదువుకుంటున్న తన కొడుకు జ్ఞప్తికి వచ్చాడు. పెళ్ళికాని పెద్దకూతురు గుర్తుకొచ్చింది. పట్టాలు కాకుండా వుండిపోయిన భూములు కళ్ళముందు కదిలాయి. అంతలో జనం వూళ్ళో వస్తున్న అంబులెన్స్ వైపు పరిగెత్తారు.